క్లుప్తంగా

నేడు బూర్జలో కృష్ణదాస్ పర్యటన

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బుధవారం బూర్జ మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పోలాకి మండలం మబగాంలోని ధర్మాన కృష్ణదాస్ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు డొంకలపర్తిలో నిర్వహించనున్న రచ్చబండ కార్యక్రమానికి కృష్ణదాస్ హాజరవుతారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొంటారు.

బాధ్యతల స్వీకరణ



ఏఓ సింహాచలం

పాతపట్నం: మండల వ్యవసాయాధికారిగా (డిప్యుటేషన్) కొర్ను సింహాచలం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎల్.ఎన్.పేట మండలం వ్యవసాయాధికారిగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి డిప్యుటేషన్‌పై ఎల్.ఎన్.పేట మండలానికి వెళ్లారు. ఏఓకు కార్యాలయ సిబ్బంది, వీఏఏలు అభినందనలు తెలియజేశారు.

శ్రమదానం



రోడ్డును బాగుచేస్తున్న స్థానికులు

హిరమండలం: వారందరూ శ్రమించి రోడ్డును బాగు చేసుకున్నారు. స్థానిక పాత హిరమండలంలోని ఎండల మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉండేది. ముళ్ల పొదలు పేరుకుపోయాయి. కార్తీక మాసంలో భక్తుల రాకపోకలకు వీలుగా రహదారిలో ఉన్న పొదలు, చెత్తను స్థానికులు తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, నారాయణరావు, శ్రీను, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన చంద్రశేఖర్

కొత్తూరు: పారాపురం సమీపంలో ఏబీ రోడ్డు మలుపులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్ఎన్‌పేట మండలం కొమ్ము‌వలస గ్రామానికి చెందిన రెడ్డి చంద్రశేఖర్ బైక్‌పై కొత్తూరు నుంచి హిరమండలం వైపు వెళ్తుండగా.. హిరమండలం నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ఘటనలో చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజేశ్వరరావు తెలిపారు.

108 సేవలపై ఆరా



పరికరాలను పరిశీలిస్తున్న 108 ప్రాజెక్టు ఎండీ గోష్

పాతపట్నం: అత్యవసర సమయాల్లో 108 సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని ఏపీ 108 ప్రాజెక్టు ఎండీ గోష్ అన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఉన్న 108 వాహనాన్ని (అంబులెన్స్) మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనం పనితీరు, వైద్య పరికరాలు, ఎమర్జెన్సీ డ్రగ్ రికార్డు, సిబ్బంది రికార్డులు పరిశీలించారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. ఇటీవల సీజనల్ వ్యాధులతో పాటు కుక్క, పాము కాటు, రోడ్డు ప్రమాదాలు, గుండె సంబంధిత కేసులు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. జిల్లా మేనేజర్లు నవీన్, రామకృష్ణతోపాటు చిన్నబాబు, రంగప్రసాద్, మెడికల్ టెక్నీషియన్ హరికృష్ణ, పైలట్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవన ఎరువులతో పోషకాల వృద్ధి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి: వ్యవసాయ సాగులో జీవన ఎరువుల వినియోగం వలన పోషకాలు వృద్ధి చెంది దిగుబడులు అధికంగా వస్తాయని ఆమదాలవలస కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కొండవలసలో జీవన ఎరువుల వాడకంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ ర్యక్రమంలో సస్యపోషణ శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, శాస్త్రవేత్తలు బాలకృష్ణ, సునీత, అగ్రికల్చర్ సిస్టెంట్ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం



అభివృద్ధికి నోచుకోని సోమవారం సంత

- వారపు సంతలో అన్నీ సమస్యలే..
- మరోవైపు ఆక్రమణలు
- నరసన్నపేట నియోజకవర్గంలో రెండో అతిపెద్ద సంత ఇది..

నరసన్నపేట: స్థానిక వారపు (సోమవారం) సంతకు ఏటా ఆదాయం బాగా వస్తున్నా.. అభివృద్ధిలో మాత్రం వెనకబడి ఉంది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంతను అటు ప్రభుత్వాలు.. ఇటు పంచాయతీ పట్టించుకోవడం లేదు. దీంతో సంత చుట్టూ సమస్యలు అల్లుకుంటున్నాయి. ఇదే అదునుగా కొందరు సంత స్థలాన్ని ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తాగేందుకు మంచి నీటి సాకర్యం లేదు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన మురుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో సంత స్థలం గోతులమయంగా మారింది. వ్యాపారులు సరుకులు వేసుకొనేందుకు అనువైన స్థలాలు లేవు. సోమవారం వచ్చిందంటే రోడ్డుపై వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఈ సంత నరసన్నపేట నియోజకవర్గంలో రెండో అతిపెద్దది అయినా అభివృద్ధి జరగడం లేదు.



రోడ్డుపైనే వ్యాపారాలు చేయడంతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

ఏటా లక్షల్లో ఆదాయం..

వారపు సంత పేరున ఏటా పంచాయతీ ఆశీలు వేలం పాట నిర్వహిస్తోంది. 2023–24లో రూ.4.25 లక్షలు, 2024–25లో రూ. 3.75 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మొత్తంలో సంత అభివృద్ధికి పైసా కూడా వెచ్చించడం లేదు. మరో పక్క ఆశీలు పేరున అధిక మొత్తంలో వసూలు చేస్తుండటం పట్ల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కనీస వసతులు కల్పించడం లేదు, తామెందుకు ఆశీలు కట్టాలని కాంట్రాక్టు ప్రతినిధులను వ్యాపారులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

చాలా ఏళ్లుగా వ్యాపారం నిమిత్తం వస్తున్నాను. ఏటా ఆశీలు పెరుగుతున్నాయి, సంత మాత్రం అభివృద్ధి చెందడం లేదు. వర్షం పడితే బురదమయంగా ఉంటుంది. వినియోగదారులు కూడా రావడం లేదు. వ్యాపారాలు అంతగా సాగడం లేదు. సంత స్థలాన్ని అభివృద్ధి చేస్తే వ్యాపారాలు బాగుంటాయి.

– రామారావు, వ్యాపారి

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతానికి సంత అభివృద్ధికి ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదు. పంచాయతీలో ఉన్న నిధుల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో సంతలో రోడ్డు వేశాం. మట్టి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ద్రాక్షాయిని, ఈఓ, నరసన్నపేట పంచాయతీ

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన కృష్ణచైతన్య



గొటివాడలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

జలుమూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కూటమి నాయకులు ఇబ్బందులు పెడితే డిజిటల్ బుక్ అండగా ఉంటుందని పార్టీ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. పర్లాం, గొటివాడ క్లస్టర్ పరిధిలో అంధవరం, పర్లాం, గొటివాడ, కూర్మనాథపురం, రామయ్యవలస గ్రామాల్లో కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతోందని, కూటమి నాయకులకు కొంతమంది అధికారులు, పోలీసులు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా బూత్ లెవెల్ అధ్యక్షుడు దామ మన్మథరావు, నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ధర్మాన జగన్, స్థానిక నాయకులు పైడి విఠల్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నవిరి పోతయ్య, శిమ్మ నాగేశ్వరరావు, రెడ్డి అప్పారావు, పిట్ట ప్రసాద్, పి.తివిటినాయుడు, తాడేల త్రినాథరావు, కొర్ను రాజు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరణ



డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొందూరు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ పోస్టర్ (క్యూ ఆర్ కోడ్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికార బలంతో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను వేధించడం, భౌతికదాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడంతోపాటు అక్రమ కేసుల్లో ఇరికిస్తోందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న కూటమి నాయకులు, వారికి సహకరిస్తున్న కొంతమంది అధికారుల వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు.

తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు వందాన వెంకటరావు, గాడు నాగరాజు, బొత్స రమణ, మొకర శంకరరావు, గుడ్ల మోహన్, పైడి నాగభూషణం బొడ్డేపల్లి ప్రసాద్ రావు, కొంచాడ గిరిబాబు, కూన రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

పాతపట్నం: క్రీడలు మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడల్లో పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని పాతపట్నం ఎస్ఐ కె.మధుసూదనరావు అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ మైదానంలో షటిల్ స్టార్స్ ఆధ్వర్యంలో బాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ఎస్ఐ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. సీహెచ్ దుర్గారావు, సుధీర్, ప్రసాద్, కృష్ణ, యువకులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లోలుగు కేజీబీవీలో మంగళవారం నారీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనకు 1098, పోలీస్ ఎమెర్జెన్సీకి 112 టోల్‌ఫ్రీ నంబర్లకు వెంటనే ఫోన్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందన..



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ మురళి

నరసన్నపేట: జాతీయ స్థాయిలో గట్కా పోటీల్లో మండలం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులు రాఘవ, శరత్, చైతన్య, పుష్ప మంగళవారం ఉదయం ఎంపీపీ ఆరంగి మురళిని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంపీపీ అభినందించారు. భవిష్యత్‌లోనూ ఆటల పోటీల్లో పాల్గొని సత్తాచాటి గ్రామం, మండలం, జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక



చాణుక్యనాయుడును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వై.చాణుక్యనాయుడు కోరుకొండ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న చాణుక్యనాయుడు సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్ష రాసి 28వ ర్యాంక్ పొందాడు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొంది ఈ ఘనత సాధించాడు. హెచ్ఎం తులగాపు కేశవరావును చాణుక్యనాయుడు మంగళవారం కలిశాడు. పాఠశాలకు మంచిపేరు తీసుకురావడంతో హెచ్ఎం అభినందనలు తెలిపారు. చాణుక్యనాయుడు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌తోపాటు నవోదయకు ఎంపికయ్యాడు. ఎంఈఓ రాంబాబు, జోగారావు, వేణుగోపాలరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

న్యాయం చేయాలి

పాతపట్నం: మండలంలోని ఎస్ఆర్ కన్సల్‌టెంట్ కార్యాలయం డైరెక్టర్ నందిగాం షణ్ముఖరావు విదేశాల్లో ఉద్యోగం ఇస్తామని నమ్మించి మోసం చేశాడని కవిటి మండలం రాజాపురం గ్రామానికి చెందిన బత్తిన గణేష్ మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన దగ్గర రూ.4.5 లక్షలు తీసుకుని ఇంతవరకు ఉద్యోగం ఇవ్వలేదన్నారు. తనతోపాటు మరో ముగ్గురికి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని షణ్ముఖరావు డబ్బులు తీసుకున్నాడని తెలిపారు. తమకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని గణేష్ కోరారు. గణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు.

అక్రమాలకు చెక్..!

- ఈ–కేవైసీ ఉంటేనే ఉపాధి
- వేతనదారుల ముఖ, కనురెప్పల నమోదు
- నవంబర్ నుంచి పక్కాగా నిబంధనలు అమలు



పాతపట్నంలో ఈకేవైసీ నమోదు చేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్ గోవింద్

పాతపట్నం: జాబ్ కార్డు ఒకరి పేరుతో ఉండగా.. మరొకరు హాజరై అక్రమాలకు పాల్పడే పరిస్థితి ఉపాధి హామీ పథకంలో ఉండకుండా కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కొత్త విధానాన్ని ప్రవేశపెడుతోంది. వేతనదారుల ఈ–కేవైసీ తీసుకుని ఆధార్‌కు అనుసంధానం చేస్తున్నారు. ఒకరికి బదులు మరొకరు హాజరైతే యాప్ అనుమతించదు. ఒక్కో రాష్ట్రంలో రెండు జిల్లాలను ఎంపిక చేసి ప్రయోగత్మకంగా అక్టోబర్ 1 నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర గామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ–కేవైసీలో నమోదైన ముఖాలు, కనురెప్పలకు క్షేత్రస్థాయిలో వేతనదారుల ఫొటోలతో సరిపోలితేనే రోజువారి మస్తరు నమోదువుతుంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే చర్యలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి పథకాన్ని వినియోగించి గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్లు (వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలు) నిర్మించడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు వందల కోట్ల రూపాయల ఆస్తులు సమకూరాయి.

నమోదులో జాప్యం

వాస్తవానికి అక్టోబర్ నుంచి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఈ–కేవైసీ నమోదులో జాప్యం జరగడంతో నవంబర్ నుంచి పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు. కొద్దిరోజులుగా మేట్‌ల సహాయంతో ఉపాధి ఫీల్డ్ అసిసెంట్లు గ్రామాల్లో తిరుగుతూ ఈ–కేవైసీ చురుగ్గా చేస్తున్నారు. ఏపీఓలు గ్రామాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి



అక్రమాలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీని నవంబర్ నుంచి అమలు చేయనుంది. ఇతరులు ఎవరు పనుల్లో పాల్గొన్న క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ ఫొటో గుర్తింపులో మస్తరు కోల్పోతారు. ఈ–కేవైసీలో నమోదై ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు 15 రోజుల్లో వేతనాలు బ్యాంకు ఖాతాలకు జమవుతాయి.

– ఎ.సురేష్, ఏపీఓ, పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో ఉపాధి వేతనదారులు, ఈకేవైసీ వివరాలు ఇలా..

మండలం	పంచాయతీలు	వేతనదారులు	పూర్తయిన ఈకేవైసీ
పాతపట్నం	34	20,207	12,269
మెళియాపుట్టి	37	20,145	14,309
కొత్తూరు	43	32,957	20,229
హిరమండలం	24	15,220	9,429
ఎల్.ఎన్.పేట	22	14,870	10,379

పేద విద్యార్థులకు అన్యాయం చేయడం తగదు



కొత్తూరు: మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీలో కోటి సంతకాలు సేకరణలో పాల్గొన్న రెడ్డి శాంతి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- చాపరలో కోటిసంతకాల సేకరణ కార్యక్రమం

మెళియాపుట్టి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మండలంలోని చాపరలో మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో కోటి సంతకాల సేకరణలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, సీనియర్ నాయకులు ఉర్లాన బాలరాజు, బైపోతు ఉదయ్‌కుమార్, భాస్కర దాస్, అలికాన మాధవరావు, లింగాల సంజీవరావు, కరణం శశిభూషణరావు, మజ్జి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న రెడ్డి శాంతి, నాయకులు

బినామీలకు కట్టబెట్టేందుకే..

కొత్తూరు: పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన 17 వైద్య కళాశాలలను కూటమి నేతలు వారి బినామీలకు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే ప్రైవేట్‌పరం చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేట్‌పరానికి వ్యతిరేకంగా మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోటి సంతకాలను సేకరించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ యర్లంకి ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరయ్యారు. ఎంపీపీ సవర సావిత్రి, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్, నిమ్మగడ్డ కృష్ణారావు, బాలకృష్ణ, శంకరరావు, అగతమూడి నాగేశ్వరరావు, తమ్మినాయుడు, బుచ్చిబాబు, రంజిత్, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అవస్థలు..!

- పలు సచివాలయాల్లో పనిచేయని ఆధార్ కేంద్రాలు
- తరచూ సర్వర్ మొరాయింపు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

ఆమదాలవలస నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాల వివరాలు..

మండలం	సచివాలయాలు	ఆధార్ కేంద్రాలు
సరుబుజ్జిలి	14	3
పొందూరు	27	4
ఆమదాలవలస రూరల్	19	4
బూర్జ	16	3



పురుషోత్తపురం సచివాలయంలో పనిచేయని ఆధార్ కేంద్రం

సరుబుజ్జిలి: ఆధార్ నమోదు, సవరణల కోసం కిలో మీటర్ల దూరం పయనించకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్దేశించిన సచివాలయాల్లో ఆధార్ సేవలను ప్రారంభించింది. ఆమదాలవలస నియోజకవర్గంలో 14 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక సమస్యలతో పలుచోట్ల ఇబ్బందులు వస్తున్నాయి. దీని వలన ప్రజలు అవస్థలుపడుతున్నారు.

ఎంపిక చేసిన ఆధార్ కేంద్రాలు ఇవే..

సరుబుజ్జిలి మండలంలోని షళంత్రి, పురుషోత్తపురం, సరుబుజ్జిలి, బూర్జ మండలంలో బూర్జ, పాలవలస, కొల్లివలస, ఆమదాలవలస మండలంలో కొర్లకోట, జొన్నవలస, ఎస్‌టీవాడ, దూసి, పొందూరు మండలంలో పొందూరు, రాపాక, లోలుగు, తాడివలస సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నిలిచిన సేవలు..

ఆధార్ కేంద్రాల్లో సర్వర్లు తరచూ మొరాయించడం వలన సేవలు సక్రమంగా కొనసాగడంలేదు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం, షళంత్రి సచివాలయాల్లో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. మిగిలిన వాటిలోనూ అరకొర సేవలతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు.

ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది



సచివాలయాల్లో ఆధార్ సేవలు పూర్తిస్థాయిలో అందక లేకపోవడంతో హిరమండలం, ఆమదాలవలస, శ్రీకాకుళంలోని ప్రైవేటు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. దీనివలన శ్రమ, ఆర్థిక భారం, కాలం వృథా అవుతున్నాయి. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– ఎం.భద్రమ్మ, సర్పంచ్, రొట్టవలస, సరుబుజ్జిలి మండలం

ఆధార్ సేవలు పునరుద్ధరిస్తాం



సర్వర్ లోపం వలన కొన్ని ఆధార్ కేంద్రాల్లో సేవలకు అంతరాయం కలుగుతోంది. వెంటనే పరిశీలన చేసి వాటిని సరిచేసి సేవలను త్వరలోనే పునరుద్ధరిస్తాం.

–ఎం.పావని, ఎంపీడీఓ, సరుబుజ్జిలి